అంతరిస్తున్న వృక్ష సంపద

- భవనాలు, షోరూంల నిర్మాణానికి అడ్డులేకుండా తొలగింపు
- గుట్టుచప్పుడు కాకుండా వృక్షాలను చంపేస్తున్న భూయజమానులు
- అదేపనిగా చెట్లు, కొమ్మలు నరికేస్తున్న విద్యుత్ శాఖాధికారులు
- బోసిపోతున్న ఎన్‌హెచ్ 165

ఉండి: గతమెంతో అందం ఇప్పుడైతే బాధాకరం అన్నట్లుంది జాతీయ రహదారి ఎన్‌హెచ్ 165 పరిస్థితి. సాధారణం పీపీరోడ్డు(పాలకొల్లు, పామర్రు) అనే నామకరణం కలిగిన హైవే భీమవరం నుంచి ఉండి రోడ్డుగా పిలువబడుతుంది. ఈ రహదారిపై 70 నుంచి 80 ఏళ్ల నాటి వృక్షాలు రోడ్డుకు ఇరువైపులా కొన్ని వందల వృక్షాలు ఉండి మంచి ఆహ్లాదకరంగా ఉండేవి. నిద్రగన్నేరు, చింత చెట్లు, కొబ్బరిచెట్లు ఇలా అనేక చెట్లతో జాతీయ రహదారి కళకళలాడేది. రానురాను కొందరు స్వార్థపరులు, ప్రభుత్వాధికారుల తీరుతో వృక్ష సంపద కనుమరుగవుతుంది. రోడ్డుకు ఇరువైపులా లేఅవుట్లు, భవనాలు, వాహనాల షోరూంలో ఏర్పడటంతో హైవే రూపురేఖలు మారిపోతున్నాయి. వాటికి అడ్డుగా వస్తున్న వృక్షాలను చెప్పా చేయకుండా ఎటువంటి అనుమతులు లేకుండానే కొట్టేస్తున్నారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొబ్బరిచెట్లను సదరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా నరికి పారేస్తున్నారు. దీంతో జాతీయ రహదారి కాస్త బోసిపోతుంది. ఒకనొక సమయంలో ఎంతో ఆహ్లాదకర వాతావరణం ఉండే ఈ రహదారి ఇప్పుడు అక్కడక్కడా మాత్రమే చెట్లు ఉన్నాయి. వేసవి సమయంలో ఈ రోడ్డులో ప్రయాణించేందుకు ఉత్సాహం చూపించే వాహనదారులు ఇప్పుడు వృక్షాలు మాయమవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృక్షాలను చంపేస్తున్నారు

గత కొన్నేళ్ల నుంచి అక్రమంగానో లేక సక్రమంగా చాలా లేఅవుట్లు, పొలాలు పూడిక చేసి హైవేను ఆనుకుని ప్లాట్లు వేయడంతో రోడ్డుపై ఉండే వృక్షాలు వాటికి అడ్డుగా ఉంటున్నాయి. అడ్డుగా వృక్షాలను వివిధ పద్ధతుల్లో అడ్డు తొలగించుకుంటున్నారు. ఏవేవో రసాయనాలు వాటిపై చల్లి వాటికవే చనిపోయేలా చేసి చివరకు చెట్లు చనిపోయి ఎండిపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయని సాకుతో వాటిని తొలగిస్తున్నారు. ప్రస్తుతం ఈ పద్ధతిని అనేకమంది భూయజమానులు ఉపయోగించి ఏళ్ల నాటి వృక్షాలను చంపేస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా నరికేస్తున్నారు

రహదారి పొడవునా ఉండి నుంచి భీమవరం వరకు వివిధ కారణాలతో వృక్షాలను నరికేస్తున్నారు. ముందుగా పొలాల్లోకి అడ్డు వస్తున్నాయని తరువాత పూడిక చేసిన స్థలాల్లోకి వచ్చేసాయని ఇలా ఏదో కారణం చెబుతూ అంచెలవారీగా వృక్షాలను నరికేస్తున్నారు. ముందు చెట్ల కొమ్మలు నరకడం తరువాత మెల్లగా చెట్లనే తొలగించడం వంటివి చేస్తున్నారు.

విద్యుత్ అధికారులు అదేపనిగా కొమ్మలు, చెట్లు కొట్టేస్తున్నారు

జాతీయ రహదారి వెంబడి ఏళ్ల నాటి భారీ వృక్షసంపద తరగిపోవడంలో విద్యుత్ అధికారుల పాత్ర కూడా ప్రముఖంగా ఉంటుంది. రహదారి వెంబడి ఏర్పాటు చేసిన వివిధ ప్రాంతాల విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు పడుతున్నాయంటూ వృక్షాలను నెలల వ్యవధిలో అనేకసార్లు కొట్టివేస్తున్నారు. భారీ వృక్షాలు కాస్త తరగిపోయి మొడువారిపోతున్నాయి. భారీ వృక్ష సంపదను కాపాడుకోవడం మాని వృక్షాల ప్రక్కనుంచి విద్యుత్ లైన్‌లు వేయడం లైన్లకు అడ్డువస్తున్నాయంటూ వాటిని నరికేయడం విద్యుత్ అధికారులకు పరిపాటిగా మారింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మొక్కలు నాటండి వాటిని సంరక్షించండి అని చెబుతూనే ఉన్నా విద్యుత్ అధికారులు వాటికి మినహాయింపుగా పురాతన వృక్షాలను కూడా ఇట్టే నరికి చంపేస్తున్నారు. ఏళ్ల తరబడి ఉండి నుంచి భీమవరం వరకు ఎంతో ఆహ్లాదంగా ఉండే జాతీయ రహదారి ఇప్పుడు బోసిపోతుంది.అక్కడక్కడా తప్ప రోడు పొడవునా వృక్షాలు మాయమయ్యాయి. ఇప్పటికైనా ఎన్‌హెచ్ అధికారులు కళ్లు తెరిచి మిగిలిన వృక్షాలనైనా కాపాడుకుంటే మానవజాతి మనుగడతోపాటు ప్రయాణికులకు సంతోషంగా ఉంటుందంటూ వాహనదారులు, ప్రయాణికులు కోరుకుంటున్నారు.



జాతీయ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా పచ్చని వృక్షాలు





జాతీయ రహదారిపై మోడువారిన వృక్షాలు

వృక్ష సంపద కనుమరుగైంది



పురాతన వృక్షాలు వివిధ వ్యక్తుల స్వార్థం, అధికారుల నిర్లక్ష్యంతో కనుమరుగైపోయాయి. ప్రస్తుతం చాలా తక్కువ వృక్షాలు మాత్రమే రోడ్డుప్రక్కన ఉన్నాయి. వాటినైనా అధికారులు సంరక్షించి పర్యావరణ పరిరక్షణ చేపట్టాలి. రోడ్డు ఆహ్లాదకరమైన స్థితిని మళ్లీ తిరిగి తీసుకురావాలి.

మునుకోలు సింహాచలం,
మాజీ సర్పంచ్, ఎన్నార్పీ అగ్రహారం.

చట్టాలను కూడా పట్టించుకోవడం లేదు



చెట్లు నరకాలంటే ఉన్నతాధికారుల అనుమతితో పాటు చట్టప్రకారం వ్యవహరించాలి. వాల్టా చట్ట ప్రకారం అక్రమంగా చెట్లు నరికితే వారిపై చర్యలు తీసుకోవాలి. ఏళ్లనాటి పురాతన చెట్లు నరుకుతున్నా, చంపుతున్నా ఎవ్వరినీ ఉపేక్షించకూడదు. అవి ఎన్నో ఏళ్ల మధురస్మృతులుగాను, పర్యావరణ పరిరక్షణకు సాధనాలు ఉన్నాయి.

గలావిల్లి ధనుంజయ,
వాహనదారుడు,ఎన్నార్పీ అగ్రహారం.

ఇప్పటికైనా శ్రద్ధ తీసుకోవాలి



ఉండి నుంచి భీమవరం వెళ్తుంటే ఎండదెబ్బకూడా తగిలేది కాదు. అంతగా రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద చెట్లు ఉండేవి. కానీ ఇప్పుడు చెట్లన్నీ కనుమరుగవుతున్నాయి. ఇప్పుడే ఏక్కడో ఓ చోట భారీ వృక్షం కనబడుతుంది. ఇప్పుడైనా సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకొని వాటిని బతికించాలి. అవి చారిత్రక ఆనవాళ్లతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రథమ భూమిక పోషిస్తాయి. కనుక వాటిని జాగ్రత్తగా కాపాడాలి.

అంగర రాంబాబు, వాహనదారుడు, ఉండి.

క్లుప్తంగా

వక్ఫ్ ఆస్తులు, రికార్డుల పరిశీలన



వక్ఫ్ ఆస్తుల్ని పరిశీలించడానికి వచ్చిన ఏపీఎస్‌డబ్ల్యూబీ అధికారులు

ఆకివీడు: స్థానికంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల్ని పరిశీలించేందుకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులు మంగళవారం ఆకివీడులోని పలు మసీదులు, ముస్లిం కాంప్లెక్స్‌లను పరిశీలించారు. రికార్డులు తిలకించారు. స్థానిక ముస్లింలు కొంత మంది చేసిన ఫిర్యాదు మేరకు రికార్డులు, ఆస్తులు తనిఖీ చేశారు. రికార్డుల్ని తీసుకువెళ్లినట్లు తెలిసింది. తనిఖీలో వక్ఫ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి టీ.సర్కార్, సూపరింటిండెంట్ సయ్యద్ రావుఫ్, కెఎండీ ఆలీమ్, ఇన్స్‌పెక్టర్, ఆడిటర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గరుడోత్సవం



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గరుడోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): గరుడ పంచమి సందర్భంగా భీమవరం జెపి రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గరుడ వాహన (గరుడోత్సవం) ఊరేగింపు మంగళవారం నిర్వహించారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామి వారిని గరుడ వాహనంపై భక్తులను దర్శనం కలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి వైభవంగా గరుడ పంచమి సేవ నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం వేదపండితులు, అర్చకులచే స్వామివారికి పంచామృత అభిషేకం, అష్టోత్తర పుష్పార్చన , నీరాజన మంత్రపుష్పములు, తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం ఘనంగా నిర్వహించారు. గరుడ పంచమి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్ కౌన్సిల్ నూతనంగా ఏర్పడిన కార్యవర్గం

ఆకివీడు: స్థానిక ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్ కౌన్సిల్ నూతన కార్యవర్గం మంగళవారం సీబీసీఎన్‌సీ చర్చి ఆవరణలో ఏర్పడింది. గౌరవ అధ్యక్షుడిగా గాతల డేవిడ్ లివింగ్ స్టన్, అధ్యక్షుడిగా బూరగ బెంజిమన్, కార్యదర్శిగా కోరాడి శ్యామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాబిన్‌సన్, గండి రాజులు వ్యవహరించారు. కార్యక్రమంలో రెవ. సీహెచ్.జార్జిముల్లర్, మండ ఏసేబు, మద్ద జ్ఞాన్‌రాజు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



మున్సిపల్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటిలో అవినీతి పెరిగి పోయిందని ముఖ్యంగా టాన్‌ప్లానింగ్ అధికారులు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అధికారులకు తెలిపారు. మంగళవారం భీమవరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే అంజిబాబు టౌన్ ప్లానింగ్ పార్థసారధి, రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌రాజులపై మండిపడ్డారు. ప్రతి విషయానికి లంచం అడుగుతున్నారని, ఇదే కొనసాగితే మీపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధ్యతయుతంగా పని చేస్తే ఇక్కడ ఉంటారని లేకుంటే ఇంటికి వెళ్లి పోవాల్సి వస్తుందన్నారు. ఈసమావేశంలో ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



మద్యం వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ బి. శ్రీలత

భీమవరం: భీమవరం పట్టణం రాయలంలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద ఉన్న రూ.74,430 విలువైన అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి. శ్రీలత తెలిపారు. భీమవరంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయలంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఉండి మండలం మహాదేవపట్నానికి చెందిన పాత ముద్దాయి బొక్కా శ్రీనివాసు కదలికలపై నిఘా ఉంచామన్నారు. యానాం ప్రాంతానికి చెందిన మీసాల మణికంఠేశ్వరరావుతో కలిసి అక్రమంగా మద్యం నిల్వ చేశారని తెలిసి తనిఖీలు చేశామన్నారు. మొత్తం 1662 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మణికంఠేశ్వరరావు దగ్గర తక్కువ ధరకు శ్రీనివాసు కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ కె.వి.ఎస్ ప్రభుకుమార్, సీఐలు కె.ఎస్.వి కల్యాణ్ చక్రవర్తి, కె.బలరామరాజు, ఎల్.రమాదేవి, వీరవల్లి శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మధ్యాహ్న భోజన పథకం



అజ్జమూరు గ్రామంలో ఎంపీపీ స్కూల్‌కు వచ్చిన కుళ్లిన గుడ్లు



అడిలిపోవడానికి సిద్ధంగా ఉన్న గుడ్లను ఉడకేసిన దృశ్యం



చాలీ చాలని పులిహోరను వడ్డనకు సిద్ధం చేసిన దృశ్యం

కుళ్లిన, అడిలిన గుడ్లు, చాలీచాలని అన్నం

ఆకివీడు: మండలంలోని పలు పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం అధ్వానంగా తయారైంది. పాఠశాలలకు సన్నబియ్యం, కోడి గుడ్లు, పప్పుదినుసులు, నూనె ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. మధ్యాహ్న భోజనంకు సరఫరా చేసే గుడ్లు పలు పాఠశాలలకు చేరినప్పుడే అడలిపోవడం, కుళ్లిపోవడం, పగిలిపోవడం జరుగుతుంది. కుళ్లిన గుడ్లను ఉడకబెట్టడం ద్వారా దుర్వాసన వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నభోజనం అధ్వానంగా ఉందని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రఫీ ఫిర్యాదు చేశారు. అజ్జమూరు గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో కుళ్లిన గుడ్లు, అడిలిన గుడ్లు రావడంతో వాటిని ప్రక్కన పెట్టాల్సి వచ్చింది. ఉడకబెట్టిన వాటిలో కూడా అడిలిన గడ్లు ఉన్నాయంటున్నారు. విద్యార్థులకు 100 గ్రాముల రైస్ పూర్తి స్థాయిలో ఉండకపోవడంతో సరిపోవడంలేదని వాపోతున్నారు. చాలీచాలని పులిహోర తయారుచేసి పెడుతున్నారు. మధ్యాహ్నభోజనంకు సన్నబియ్యం సరఫరా చేసినా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు పూర్తి స్థాయిలో తినడానికి ఇష్టపడటం లేదు. ఇంటి వద్ద నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్నభోజనం తయారీ, వడ్డనపై పర్యవేక్షణ లోపించిందని పలువురు ఆరోపిస్తున్నారు.

నిర్వాహక గ్రూపు తొలగింపు

మండలంలోని సిద్ధాపురం జెడ్పీ స్కూల్‌లో మధ్యాహ్నభోజన తయారీ నిర్వహక గ్రూపును తొలగిస్తూ తీర్మానం చేసినట్లు ఎంఈఓ ఏ.రవీంద్ర మంగళవారం చెప్పారు. మధ్యాహ్నభోజనం తయారీలో అవకతవకలు ఉన్నాయని ఎస్ఎంసీ చైర్మన్ రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, హెచ్‌ఎం , గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ బహూకరణ



భీమవరంలో దివ్యాంగురాలు భాగ్యలక్ష్మికి వీల్‌చైర్ బహూకరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని 21 వార్డుకు చెందిన దివ్యాంగురాలు చిడిగెల భాగ్యలక్ష్మికి పట్టణానికి చెందిన గ్రంధి నానాజీ కుమార్తె గ్రంధి మౌనిక వీల్ చైర్ బహూకరించారు. సదరం క్యాంపునకు వచ్చి నడవడానికి ఇబ్బంది పడుతున్న భాగ్యలక్ష్మి అవస్థను గమనించిన నానాజీ వెంటనే స్పందించి విషయం కుటుంబసభ్యులకు వివరించడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మౌనిక సుమారు రూ. 6 వేలు ఖరీదైన వీల్‌చైర్ సమకూర్చారు. మంగళవారం బాధితురాలు భాగ్యలక్ష్మికి మాజీ కౌన్సిలర్స్ మెంటే గోపి, మెంటే బలరామ్, పాపోలు ఏడుకొండలు ఆధ్వర్యంలో అందజేశారు.

డీఎన్నార్ కళాశాల వద్ద ఏబీవీపీ ఆందోళన



డీఎన్నార్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కళాశాల ప్రధాన గేటువద్ద బైఠాయించిన నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఏబీవీపీ పట్టణ కార్యదర్శి రత్నాల జగదీష్ మాట్లాడుతూ డీఎన్నార్ కళాశాల హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు కనీసం పరిశుభ్రమైన తాగు నీరు కూడా అందించడం లేదంటూ హాస్టల్ నిర్వహణ ఏ విధంగా ఉందో అవగతమవుతుందన్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించి డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులు తాగునీరు, ఇతర అవసరాలకు వాడుకునే నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని కనీసం భోజనం తయారీకి వినియోగించే నిత్యావసర సరుకులు నాణ్యత లేవని ఆరోపించారు. అన్నంలో సున్నం కలుపడం వల్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని వాపోయారు. హాస్టల్స్‌లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కళాశాల యాజమాన్యాన్ని జగదీష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ సహ కార్యదర్శి సాయికృష్ణ, రోహిత్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి దాతలు సహకరించాలి



మునిసిపల్ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డును వెడ్‌మిక్స్‌తో అభివృద్ధి చేసిన దృశ్యం

భీమవరం: సమస్యల పరిష్కారానికి దాతల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు వెళ్లాలని భీమవరం పట్టణంలోని పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం కోడే వెంకట్రావు అన్నారు. చినరంగనిపాలెంలోని పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్ నుంచి పాలెం రోడ్డు వరకు వెడ్ మిక్స్ రోడ్డును మాజీ కౌన్సిలర్ చెల్లబోయిన సుబ్బారావు నిర్మించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానికంగా ఉన్న చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఆధారపడకుండా దాతలు ముందుకు రావాలన్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి స్కూల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వెంకట్రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, మాజీ కౌన్సిలర్స్ చెల్లబోయిన సుబ్బారావు, బొక్కా చంద్రమోహన్, సీహెచ్ శాంతి రాజు, ఇళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో స్పెషల్ డ్రైవ్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్



భీమవరం డీఎన్నార్ కళాశాలలో స్పెషల్ డ్రైవ్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల సప్లమెంటరీ విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు చెప్పారు. సోమవారం కళాశాలలో నోటిఫికేషన్ విడుదల సందర్భంగా వివరాలను తెలిపారు. తమ కళాశాలలో 2001-02 విద్యాసంవత్సరం నుంచి 2019-20 వరకూ డిగ్రీ చదివి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్పెషల్ డ్రైవ్ పరీక్షల నిర్వహణకు అవసరమైన అనుమతులన్నీ యూనివర్సిటీ నుంచి తీసుకున్నామన్నారు. స్పెషల్ డ్రైవ్ పరీక్ష వచ్చే జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి మోజెస్, ఏవో పి రామకృష్ణంరాజు, అల్లూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



ఉండి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నసీరుల్లా



కాళ్ల: దొడ్డనపూడి హైస్కూల్లో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

ఉండి: విద్యార్థులు సైబర్ నేరాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్ బాగుంటుందని ఆకివీడు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జగదీశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఉండిలోని శశి స్కూల్‌లో సైబర్‌నేరాలు, డ్రగ్స్, ఉమెన్ అండ్ చిల్డన్ సేఫ్టీ, శక్తి యాప్‌ల వినియోగంపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒక్కసారి దాని బారినపడితే జీవితం నాశనం అవుతుంది కనుక ఎవ్వరూ మత్తు పదార్థాల జోలికిపోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే అతిసులభంగా చాలా మంది విద్యార్థులు సైబర్ నేరాల్లో చిక్కుకుంటున్నారని అటువంటి వాటి విషయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా చట్ట విరుద్ధమైన యాప్‌ల్లో ఎటువంటి యాక్టివిస్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే మహిళలు, చిన్నపిల్లలు అపరిచితుల విషయంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. ఏదైనా అనుమానం ఉంటే కుటుంబికులకు లేదా పోలీసులకు వెంటనే సమాచారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎండీ నసీరుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కాళ్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాళ్ళ ఎస్సై ఎన్. శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం దొడ్డనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థిని, విద్యార్థులకు కాళ్ళ పోలీసులు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ , స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్లలో తెలియని యాప్, మెసెజ్‌ల లింక్‌లపై టచ్ చేయరాదని సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దుచేసే వరకు ఆందోళనలు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ప్రక్రియ రద్దుచేసే వరకు ఆందోళనలు చేస్తామని భీమవరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సంఘాల ఐక్యవేదిక స్పష్టం చేసింది.స్థానిక సుందరయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె సత్యనారాయణ, చేతివృత్తుల సంఘం జిల్లా నాయకుడు ఎం సీతారామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నపుడు వ్యతిరేకరించిన స్మార్ట్‌మీటర్స్, కూటమి అధికారంలోనికి రాగానే స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై తీవ్ర భారాలు మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్‌మీటర్లను రద్దు చేసేవరకు ప్రజలతో ఆందోళన చేస్తామని దీనిలో భాగంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి ఆగస్టు 1వ తేది వరకు భీమవరంలో స్మార్ట్‌మీటర్ల దుష్ప్రబావాన్ని - ప్రజలపై వేస్తున్న విద్యుత్ బారాలను వివరిస్తూ ప్రచారయాత్ర నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 2న చాంబర్ ఆఫ్ కామర్స్‌భవనంలో స్మార్ట్‌మీటర్స్– ప్రత్యామ్నాయం అనే అంశంపై సదస్సు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రజానీకంతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు గోపాలన్ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు, ఎఐటియుసి జిల్లా నాయకుడు కోనాల భీమారావు, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకుడు శ్రీనివాసరాజు, గులివెల్లి రాంబాబు, ఎం మహంకాళరావు, కె క్రాంతిబాబు, ఇంజేటి శ్రీను, నాగిడి శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.